teluguislam.net



# దివ్యఖుర్ఆన్ వెలుగులో నికాహ్

**23వ అంశం** శీలవతులైన స్త్రీల వివాహం శీలవంతులైన పురుషులతో, దుర్నడత గల స్త్రీల వివాహం దుర్నడత గల పురుషులతో.

"అపవిత్ర స్త్రీలు అపవిత్ర పురుషులకు తగినవారు. అపవిత్ర పురుషులు అపవిత్ర స్త్రీలకు తగినవారు. (అలాగే) పవిత్ర స్త్రీలు పవిత్ర పురుషులకు తగినవారు. పవిత్ర పురుషులు పవిత్ర స్త్రీలకు తగినవారు." (అన్ నూర్: 26)

**24వ అంశం** మూడు (సార్లు) విడాకులు పొందిన మహిళ 'గడువు' ముగిసిన తరువాత పునర్వివాహం చేసుకోవాలి. ఒకవేళ రెండవ భర్త సంభోగించిన మీదట ఇష్టపూర్వకంగా ఆమెకు విడాకులిస్తే అట్టి మహిళ ఇద్దత్ (గడువు) అనంతరం తన మొదటి భర్తను నికాహ్ చేసుకోదలిస్తే చేసుకోవచ్చు.

వివరణ: 66వ నిబంధన క్రింద ఇవ్వబడిన ఖుర్ఆన్ సూక్తిని చూడండి.

**25వ అంశం** స్త్రీల వారసత్వ సొమ్మును బలవంతంగా కబళించరాదు.

**26వ అంశం** భర్త మరణానంతరం వితంతువు పునర్వివాహం చేసుకోదలిస్తే వారించకూడదు.

**27వ అంశం** స్త్రీ రూపురేఖలు, వ్యవహార సరళి నచ్చకపోతే వెంటనే వేర్పాటు నిర్ణయానికి రాకుండా ఓపిక పట్టాలి. మన్నింపుల వైఖరితో సంసార రథం నడపటానికి యత్నించాలి.

"విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు బలవంతంగా స్త్రీలకు వారసులై కూర్చోవటం మీకు ధర్మసమ్మతం కానేరదు. మీరు వారికి ఇచ్చిన దాని (మహర్)లో నుంచి కొంత సొమ్మును కాజేసే ఉద్దేశంతో వారిని ఆపి ఉంచుకోకండి. ఒకవేళ వారు గనక బాహాటంగా ఏదైనా నీతిమాలిన పనికి పాల్పడితే అది వేరే విషయం. వారితో ఉత్తమ రీతిలో కాపురం చేయండి. ఒకవేళ వారు మీకు నచ్చకపోతే బహుశా ఏదో ఒక్క విషయం మూలంగా మీకు నచ్చకపోవచ్చు. కాని మీకు నచ్చని ఆ విషయంలోనే అల్లాహ్ అపారమైన శుభాన్ని పొందుపరచాడేమో! (మీకేం తెలుసు?) (అన్ నిసా: 19)

**28వ అంశం** కుటుంబ వ్యవస్థలో పురుషుడు నిర్వాహకుడు. స్త్రీ అతని అధీనంలో ఉంటుంది. పురుషుడు పాలకుడు. స్త్రీ పాలితురాలు. పురుషుడు ఆజ్ఞాపించేవాడు, స్త్రీ అతనికి విధేయురాలు.

**29వ అంశం** పురుషుడు ఇంటికి పెద్ద గనక తన కుటుంబీకులు, ఆలుబిడ్డల అవసరాలను తీర్చవలసిన బాధ్యత అతనిపై ఉంటుంది.

**30వ అంశం** భర్తకు విధేయురాలిగా, విశ్వాస పాత్రురాలిగా రాణించటం ఉత్తమ ఇల్లాలి లక్షణం.

**31వ అంశం** భర్త ఇంట్లో లేనప్పుడు అతని హక్కులను కాపాడటం, కుటుంబ గౌరవాన్ని రక్షించటం ఆదర్శ ఇల్లాలి కర్తవ్యం.

**32వ అంశం** పెడసరిగా ప్రవర్తించే పడతులను దారికి తేవటానికి మొదటి చర్యగా వారికి నచ్చజెప్పాలి. రెండవ చర్యగా పడక గదిలో వారిని వేరు చేయాలి. అప్పటికీ పెంకితనం చూపితే గత్యంతరం లేని పరిస్థితిలో తేలిగ్గా దండించాలి.

**33వ అంశం** భార్య భర్తకు విధేయత కనబరచిన తరువాత కూడా ఆమెను సాధించటం భావ్యం కాదు.

"పురుషులు స్త్రీలపై అధికారులు. ఎందుకంటే అల్లాహ్ ఒకరికి ఇంకొకరిపై విశిష్టతను వొసగాడు. అదీగాక పురుషులు తమ సంపదను (వారిపై) ఖర్చుపెట్టారు. కనుక గుణ వంతురాలైన స్త్రీలు విధేయులై ఉంటారు. తమ భర్తలు లేని సమయంలో అల్లాహ్ రక్షణలో ఉంటూ (తమ శీలాన్ని, భర్త సంపదను) కాపాడుతారు. ఏ స్త్రీలు అవిధేయతకు పాల్పడతారని మీకు భయం ఉంటుందో వారికి నచ్చజెప్పండి, (అవసరమైతే) పడక దగ్గర వారిని వేరుగా ఉంచండి. వారిని కొట్టండి. ఆ తరువాత వారు గనక మీకు విధేయులైతే వారిని అనవసరంగా వేధించే ఉద్దేశ్యంతో సాకులు వెతక్కండి. నిశ్చయంగా అల్లాహ్ సర్వోన్నతుడు, గొప్పవాడు." (అన్ నిసా: 34)

**34వ అంశం** హృదయ పూర్వకంగా భార్యలందరి మధ్య న్యాయంగా వ్యవహ రించటం భర్త వల్లకాని పని. అయితే పోషణా ఖర్చులు, తదితర హక్కుల విషయంలో సమత్వం, సమతూకం పాటించండి. అది అవశ్యం.

"మీరు ఎంతగా ఆశించినప్పటికీ, శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ మీ భార్యలందరి మధ్య మీరు అన్ని విధాలా న్యాయం చెయ్యటమన్నది మీ వల్ల కానిపని. కాబట్టి మీరు పూర్తిగా ఒకామె వైపు మొగ్గిపోయి, రెండో ఆవిడను అనిశ్చిత స్థితిలో పడవెయ్యకండి. ఒకవేళ మీరు మీ ధోరణిని సరిదిద్దుకుని, భయభక్తులు(తఖ్వా)తో మసలు కుంటే నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడు." (అన్ నిసా: 129)

teluguislam.net


వివరణ: అల్లాహ్‌కు భయపడుతూ భార్యలందరి మధ్య న్యాయం చేసేందుకు శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ మానవ సహజమైన దౌర్బల్యం వల్ల ఏదన్నా లోటు జరిగితే అల్లాహ్ క్షమిస్తాడు- ఇన్‌షా అల్లాహ్.

**35వ అంశం** **భర్త మరణించిన తరువాత వితంతు స్త్రీ నాలుగు మాసాల పది రోజుల వరకు పునర్వివాహం చేసుకోవటం గానీ, అలంకరించుకోవటం గానీ, ఇంటి బయటకెళ్ళి రాత్రి గడపటం గానీ చేయజాలదు. దీనినే షరీయతు పరిభాషలో 'సంతాప గడువు' అంటారు.**

"మీలో ఎవరయినా మరణించి, వారు భార్యలను వదలిపోతే అటువంటి స్త్రీలు నాలుగు మాసాల పది రోజుల వరకూ తమను తాము గడువు (ఇద్దత్)లో ఆపుకోవాలి. గడువు ముగిసిన తరువాత వారు సంస్కారవంతమైన పద్ధతిలో తమ కొరకు మంచిదనుకున్న కార్యమేదైనా చేసుకుంటే అందులో మీపై దోషం ఏమీలేదు. మీరేమేమి చేస్తున్నారో అల్లాహ్‌కు అంతా తెలుసు." (అల్ బఖర: 234)

వివరణ: నికాహ్ తరువాత భర్త తనతో సమాగమం జరిపినా, జరపక పోయినా- రెండు పరిస్థితుల్లోనూ - భర్త మరణించిన స్త్రీ నాలుగు మాసాల పది రోజుల వరకు సంతాప గడువు పాటించవలసి ఉంటుంది. ఒకవేళ ఆమె గర్భవతి అయివుంటే బిడ్డను ప్రసవించగానే ఆమె 'ఇద్దత్' ముగుస్తుంది. ఇక్కడ గమనించవలసిన మరో విషయమేమిటంటే భర్త సమాగమం జరిపివున్న స్త్రీ 'మద్‌ఖూలా'గా, భర్త సమాగమం జరపని స్త్రీ 'గైర్ మద్‌ఖూలా'గా పిలువబడుతుంది.

**36వ అంశం** **విశ్వాసులైన స్త్రీల వివాహం ముష్రిక్ పురుషులతో, విశ్వాసులైన పురుషుల వివాహం ముష్రిక్ స్త్రీలతో జరిపించకూడదు.**

**37వ అంశం** **విశ్వసించిన బానిస స్త్రీ స్వతంత్రురాలైన ముష్రిక్కు స్త్రీ కంటే నయం.**

**38వ అంశం** **విశ్వసించిన ఒక బానిస పురుషుడు స్వతంత్రుడైన ముష్రిక్ పురుషుని కన్నా మేలు.**

"దైవానికి భాగస్వామ్యం కల్పించే స్త్రీలు విశ్వసించి ముస్లింలు కానంతవరకూ మీరు వారిని వివాహమాడకండి. దైవానికి భాగస్వామ్యం కల్పించే స్వతంత్ర స్త్రీ మీకు ఎంతగా నచ్చినప్పటికీ ఆమెకన్నా అల్లాహ్‌ను విశ్వసించే ఒక బానిస స్త్రీ ఎంతో ఉత్తమురాలు. (అలాగే) షిర్కుకు ఒడిగట్టే పురుషులు విశ్వసించనంతవరకూ మీ స్త్రీలను వారి వివాహబంధంలోకి ఇవ్వకండి. ఎందుకంటే షిర్కుకు పాల్పడే పురుషుడు మీకు నచ్చినప్పటికీ అతనికంటే

విశ్వసించిన ఒక బానిస పురుషుడు ఎన్నో రెట్లు నయం. వీరు (మిమ్మల్ని) నరకం వైపుకు పిలుస్తున్నారు. కాని అల్లాహ్ తన అనుజ్ఞతో మిమ్మల్ని స్వర్గం వైపునకు, క్షమాభిక్ష వైపునకూ పిలుస్తున్నాడు. ప్రజలు గుణపాఠం నేర్చుకునేందుకుగాను ఆయన తన ఆయతులను విడమరచి మరీ చెబుతున్నాడు." (అల్ బఖర : 221)

**39వ అంశం** **వేరొకరి వివాహ బంధంలో వున్న స్త్రీని వివాహమాడటం హరామ్ (నిషిద్ధం).**

**40వ అంశం** **యుద్ధప్రాప్తిగా వచ్చిన అవిశ్వాసుల వివాహిత, అవివాహిత స్త్రీలు తమ ముస్లిం యజమానుల కొరకు నికాహ్ జరగకపోయినా ధర్మ సమ్మతమే.**

**41వ అంశం** **నికాహ్ (వివాహం) ఉద్దేశ్యం ఏమిటి? వ్యభిచారం, నీతి బాహ్యత, అశ్లీలం వంటి చెడుగులను రూపుమాపి సౌశీల్యం, పారిశుద్ధ్యంతో కూడిన జీవితం గడపటం.**

"భర్త గల స్త్రీలు కూడా మీ కోసం నిషేధించబడ్డారు. అయితే మీ యాజమాన్యంలోనికి వచ్చిన బానిస స్త్రీలు మాత్రం (నిషేధించబడలేదు).అల్లాహ్ ఈ ఆదేశాలను మీపై విధించాడు. ఈ స్త్రీలు మినహా మిగతా స్త్రీలను మీరు మహర్ రూపంలో ధనం చెల్లించి వివాహ మాడటం మీకొరకు ధర్మసమ్మతం (హలాల్) చేయబడింది. అయితే చెడుల నుండి దూరంగా ఉండే ఉద్దేశంతోనే ఈ పని చేయాలి తప్ప కామక్రీడల కోసం కాదు." (అన్ నిసా: 24)

వివరణ : ఈ ఆయత్‌లో అల్లాహ్ బానిస స్త్రీలను వివాహ మాడకపోయినా వివాహిత భార్యల మాదిరిగా తమ ఇంట్లో ఉంచుకోవటానికి అనుమతించాడు. బానిస స్త్రీలకు సంబంధించి ఇస్లామీయ షరీయత్ విధించిన ఇతరత్రా ఆదేశాలు ఇవి:

1) యుద్ధం ముగిసిన తరువాత ఖైదీలైన స్త్రీలను ప్రభుత్వం మాత్రమే సిపాయిలకు పంచి ఇవ్వగలదు. పంపకానికి ముందు ఏ సిపాయి కూడా ఖైదీగా పట్టుబడిన స్త్రీని ముట్టుకోలేడు. ఒకవేళ ఎవరయినా అలా చేస్తే అది వ్యభిచారంగా పరిగణించబడుతుంది.

2) యుద్ధ ఖైదీగా వచ్చిన స్త్రీ గర్భవతిగా ఉంటే ఆమె ప్రసవించేవరకూ ఆమె యజమాని కూడా ఆమెతో శారీరక సంబంధం ఏర్పరచుకోరాదు.

3) ఖైదీగా వచ్చిన స్త్రీ ఏ మతస్తురాలైనా (ఇస్లాం తప్ప) ఆమెతో సంభోగించటం ఆమె యజమానికి ధర్మసమ్మతమే.

4) బానిసరాలిని ఆమె యజమాని తప్ప వేరొక పురుషుడు తాకలేడు.

teluguislam.net


5) బానిస స్త్రీకి ఆమె యజమాని ద్వారా కలిగిన సంతానం కూడా చట్టపరంగా యజమాని సంతానంగానే పరిగణించబడుతుంది. సంతానం కలిగిన తరువాత ఆ బానిసరాలిని వేరొకరికి విక్రయించటం తగదు. యజమాని చనిపోగానే ఆ స్త్రీ స్వేచ్ఛ పొందిన స్త్రీగా భావించబడుతుంది.

6) యజమాని తన బానిసరాలిని వేరొకరికిచ్చి వివాహం జరిపిన పక్షంలో ఆ రోజు నుంచే ఆమెతో అతని సంబంధం తెగిపోతుంది.

7) ఏ స్త్రీనయినా ప్రభుత్వం ఒక పురుషునికి ఇచ్చిన మీదట ప్రభుత్వం ఇక ఎన్నడూ ఆ స్త్రీని తిరిగి తీసుకోజాలదు. తన సంరక్షణలో ఉన్న స్త్రీ వివాహం జరిపిన మీదట 'వలీ' స్థితి ఎలాంటిదో ఇదీ అలాంటిదే.

8) నికాహ్ తరువాత భార్యాభర్తలు ఏ విధంగానయితే పరస్పరం ధర్మసమ్మతం అవుతారో, అదే విధంగా ప్రభుత్వం తరఫున ఏ పౌరునికైనా ఇవ్వబడిన యాజమాన్య హక్కు అతని కొరకు ధర్మసమ్మతం అవుతుంది. ఈ రెండు చట్టాలు ఒకే దేవుని తరఫున ప్రసాదించ బడినవన్న సంగతి గమనార్హం.

9) యుద్ధ పరిస్థితులు అనిశ్చితంగా ఉంటాయి. గనక ఒకవ్యక్తి ఏక కాలంలో ఎందరు బానిస స్త్రీలను కలిగి ఉండవచ్చు? అన్నది కూడా నిర్ధారితం కాలేదు.

10) బానిస స్త్రీల శాసనం లేదా ఆజ్ఞ రద్దు పరచబడలేదు. పైగా పరిస్థితుల దృష్ట్యా, అవసరాల దృష్ట్యా ప్రళయదినం వరకూ ఇది ఉంటుంది.(తఫ్హీముల్ ఖుర్ఆన్, మొదటి భాగం : పేజీ: 340-341లోని అంశాల సంక్షిప్తీకరణ)

## 42వ అంశం గ్రంథవహులకు చెందిన శీలవతులతో నికాహ్ సమ్మతమే.

"సౌశీల్యవతులగు ముస్లిం స్త్రీలు, మీకు పూర్వం గ్రంథం వొసగబడిన వారి సౌశీల్య వతులగు స్త్రీలు కూడా మీ కొరకు హలాల్ అవుతారు. అయితే మీరు వారికి చెల్లించవలసిన మహర్ సొమ్మును చెల్లించి, వారిని వివాహబంధంలోకి తెచ్చుకోవాలి. అంతేగాని, బహి రంగంగా వ్యభిచారం చేయటం, చాటుమాటు ప్రేమకలాపాలు జరపటం కోసం వారు మీకు హలాల్ కారు. విశ్వాసాన్ని తిరస్కరించిన వారి కర్మలు వృధా అయిపోతాయి. పర లోకంలో వారు నష్టపోయిన వారిలో చేర్తారు." (అల్ మాయిదా: 6)

వివరణ : 1) గ్రంథ వహుల స్త్రీలను వివాహం చేసుకోవచ్చుగాని తమ స్త్రీలను గ్రంథంగల పురుషులకిచ్చి వివాహం చేయరాదు.

2) గ్రంథవహుల స్త్రీలు ఒకవేళ ముష్రిక్కులై ఉంటే వారిని వివాహమాడరాదు. 36వ నిబంధన.

**43వ అంశం** ఏ పిల్లవాడైనా రెండేళ్ళ వరకు లేదా అంతకుముందే ఏ స్త్రీ చనుబాలు అయినా త్రాగివుంటే పాల వరుస సంబంధం ఏర్పడినట్లే. రెండేళ్ల తరువాత పాలుత్రాగితే పాల వరుస సంబంధం ఏర్పడదు.

"మరి మేము మానవునికి అతని తల్లిదండ్రుల విషయంలో గట్టిగా తాకీదు చేశాము- అతని తల్లి అతన్ని ప్రయాసపై ప్రయాసకు ఓర్చుకుంటూ తన గర్భంలో మోసింది. మరి అతని పాలను విడిపించటానికి రెండు సంవత్సరాలు పట్టింది." (లుఖ్మాన్: 14)

వివరణ: కనీసం ఐదు గుక్కెళ్ళ పాలు త్రాగి ఉండాలన్నది షరతు. అంతకన్నా తక్కువ మోతాదులో త్రాగివుంటే పాల వరుస సంబంధం ఏర్పడదు.

(వివరాలకు చూడండి- నిబంధన : 227)

**44వ అంశం** దత్తత కారణంగా నికాహ్ 'హరామ్' అవదు.

"మరి జైద్ ఆ స్త్రీతో లాంఛనాలన్నీ పూర్తి చేసిన తరువాత, మేము ఆమె (విడాకులు పొందిన ఆ స్త్రీ) వివాహం నీతో జరిపించాము. దత్త పుత్రులు తమ భార్యల లాంఛనాలన్నీ పూర్తి చేసిన తరువాత (వారికి విడాకులు ఇచ్చిన పిమ్మట) వారి భార్యల (ను వివాహమాడే) విషయంలో ముస్లింలు ఎలాంటి సంకోచానికీ లోనుకాకుండా ఉండేటందుకు మేమిలా చేశాము. అల్లాహ్ ఆజ్ఞ అమలు జరిగి తీరవలసిందే." (అల్ అహ్జాబ్: 37)

**45వ అంశం** రమజాన్ మాసంలో రాత్రిపూట తమ భార్యల వద్దకు పోవటం ధర్మసమ్మతమే.

**46వ అంశం** భార్యాభర్తలు ఒండొకరి రహస్యాలు తెలిసినవారు. వారు తమ రహస్యాల్ని రహస్యంగానే ఉంచాలి.

"ఉపవాస కాలంలోని రాత్రులలో మీరు మీ భార్యలను కలుసుకోవటం మీ కొరకు ధర్మసమ్మతం చేయబడింది. వారు మీకు దుస్తులు. మీరు వారికి దుస్తులు." (అల్ బఖర:187)

**47వ అంశం** వివాహ ముడి పురుషుని చేతిలో వుంది, స్త్రీ చేతిలో కాదు. (వివరాలకు 82వ అంశం చూడండి)

**48వ అంశం** నికాహ్ (వివాహం) మనిషికి సుఖసౌఖ్యాలిచ్చే సాధనం.

**49వ అంశం** నికాహ్ తరువాత అల్లాహ్ దంపతులిద్దరి మధ్య ప్రేమానురాగాలను, దయాదాక్షిణ్యాలను సృజిస్తాడు.

teluguislam.net



"మరి ఆయన సూచనలలోనే ఒకటేమంటే; ఆయన మీకోసం స్వయంగా మీలో నుంచే భార్యలను సృజించాడు- మీరు వారివద్ద ప్రశాంతత పొందటానికి! ఆయన మీ మధ్య ప్రేమనూ, దయాభావాన్నీ పొందుపరిచాడు. నిశ్చయంగా ఆలోచించేవారి కోసం ఇందులో ఎన్నో సూచనలున్నాయి." (అర్ రూమ్-21)

**50వ అంశం శీలవంతులైన స్త్రీ పురుషుల వివాహం దుర్నడత గల స్త్రీ పురుషులతో జరిపించటం అధర్మం (హరామ్).**

"వ్యభిచారం చేసే పురుషుడు వ్యభిచారం చేసే స్త్రీని లేక ముష్రిక్కు స్త్రీని తప్ప మరెవరినీ వివాహమాడలేడు. అలాగే వ్యభిచారానికి పాల్పడే స్త్రీ కూడా వ్యభిచారం చేసే పురుషుడిని లేక ముష్రిక్కు మగాణ్ణి తప్ప వేరితరులను మనువాడజాలదు. విశ్వాసుల కొరకు ఇది నిషేధించబడింది." (అన్ నూర్: 3)

**51వ అంశం రజస్వల కాకముందే స్త్రీని వివాహమాడటం షరీయతుపరంగా ధర్మసమ్మతమే.**

"మీ స్త్రీలలో ముట్టుపై ఆశ వదులుకున్న వారి విషయంలో మీకేదైనా సందేహ ముంటే, వారి గడువు మూడు నెలలు. రజస్వల (రుతు స్రావం మొదలు) కాని వారి గడువు కూడా అంతే. గర్భవతుల గడువు వారి ప్రసవం అయ్యేవరకూ ఉంటుంది. ఎవడు అల్లాహ్‌కు భయపడతాడో అతనికి అల్లాహ్ అతని వ్యవహారంలో సౌలభ్యం కల్పిస్తాడు." (అత్ తలాఖ్:4)